సాక్షి ప్రకాశం

1

గురువారం । 2 । అక్టోబర్ । 2025



న్యూస్‌రీల్

ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ఒంగోలు సిటీ: చెడు పై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా భావించే విజయదశమి పండుగను ప్రజలు సుఖసంతోషాలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని పలువురు ప్రజాప్రతినిధులు ఆకాంక్షించారు. దుర్గామాత ఆశీస్సులు అందరికీ ఉండాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ చుండూరి రవి బాబు, పార్టీ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. జిల్లా ప్రజలందరికీ విజయాలు దక్కాలని కోరుకుంటున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు ఎస్పీ దసరా శుభాకాంక్షలు



ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ఒంగోలు టౌన్: జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎస్పీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా విజయదశమి పండుగ జరుపుకుంటామని ఎస్పీ తెలిపారు. ఈ దసరా ప్రతి ఒక్కరి జీవితాల్లో విజయాలు సమకూర్చాలని, చేపట్టిన కార్యక్రమాలు సఫలీకృతం కావాలని ఆకాంక్షించారు.

హామీ బండ వారింది!

- ప్రభుత్వ వైఖరిపై మండిపడుతున్న గ్రానైట్ యజమానులు
- కొత్త శ్లాబ్ విధానంపై ఆగ్రహం
- మూతపడిన 2500 గ్రానైట్ ఫ్యాక్టరీలు
- నిలిచిపోయిన గ్రానైట్ లావాదేవీలు
- ప్రైవేటు పెత్తనం వద్దేవద్దంటున్న యాజమాన్యాలు
- శ్లాబ్ విధానాల ద్వారా నెలకి రూ.20 కోట్లు, రాయల్టీ ద్వారా మరో రూ.30 కోట్లు ప్రభుత్వాదాయానికి గండి
- ఫ్యాక్టరీలు మూత పడడం, వరుస పండగలతో కార్మికులు సొంతూళ్లకు పయనం



చీమకుర్తి-మర్రిచెట్లపాలెం మధ్య కర్నూలు రోడ్డుకు ఇరువైపులా గ్రానైట్ ఫ్యాక్టరీలు

గ్రానైట్‌పై ప్రైవేటు సంస్థలకు పెత్తనం ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వ్యాపారులు భగ్గుమంటున్నారు. సరిగ్గా సాగక అంతంత మాత్రంగా ఉన్న గ్రానైట్ వ్యాపారంపై పన్నుల భారం పడనుంది. ఈ నెల నుంచి కొత్త విధానం అమలులోకి రావడంతో ప్రతీ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఆర్థిక భారం తడిసిమోపెడు కానుంది. ప్రైవేటు పెత్తనం వద్దని, పాత విధానాన్నే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఫ్యాక్టరీ యజమానులు బుధవారం నుంచి పరిశ్రమలు మూతేశారు. ఎప్పుడూ కార్మికులతో కళకళలాడే ఫ్యాక్టరీలు బోసిపోయాయి. దీనినే నమ్ముకున్న సుమారు 30 వేల మంది కార్మికులు పనిలేకుండా ఖాళీగా ఉండిపోయారు. అలాగే క్వారీల్లో సైతం పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకునే వరకూ ఆందోళన చేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు.

చీమకుర్తి:

''అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రొడక్షన్ బేస్ మీద రాయితీ ఇస్తాం. గ్రానైట్ పరిశ్రమను ఆదుకుంటాం'' అంటూ యువగళంలో నారా లోకేష్ మాటిచ్చారు. అధికారంలోకి వచ్చాక గ్రానైట్ పరిశ్రమ మనుగడను కోల్పోయేలా శ్లాబ్ విధానాలను పెంచటమే కాకుండా రాయల్టీ వసూళ్లలో ప్రైవేటు పెత్తనం తీసుకొచ్చారని ఫ్యాక్టరీల యజమానులు మండిపడుతున్నారు. ఇప్పుడైనా ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఒక పక్క గ్రానైట్ పరిశ్రమ మనుగడ కోల్పోవడంతో పాటు 30 వేల మంది కార్మికుల ఉపాధిని దెబ్బతీసినట్లవుతుందని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి భారీగా గండిపడుతుందని వారు అంటున్నారు. కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త శ్లాబ్ విధానంలో ఒక్కో బ్లేడ్‌కు చెల్లించే రూ.27 వేలు కాస్తా రూ.35 వేలకు పెరిగింది. ఫలితంగా ఫ్యాక్టరీల మనుగడ ప్రశ్నార్థకంగా మారనుంది. ఒక్క చీమకుర్తి మండలంలోని చీమకుర్తి, ఆర్‌ఎల్.పురం, బూదవాడ, ఏలూరు పరిధిలోని 800 గ్రానైట్ ఫ్యాక్టరీలలో దాదాపు 3 వేల బ్లేడ్‌లు ఉన్నట్లు అంచనా. ఒక్కో బ్లేడ్‌కు రూ.35 వేలు చొప్పున నెలకు రూ.10.5 కోట్ల ఆదాయం ఒక్క నెలకే వస్తుంది. అలాంటిది జిల్లాలోని మిగిలిన 1200 ఫ్యాక్టరీలలో మరో 3 వేల బ్లేడ్‌లు ఉంటాయి. వాటి ద్వారా మరో రూ.10.5 కోట్ల ఆదాయం వస్తుంది. వెరసి గ్రానైట్ ఫ్యాక్టరీలలోని 6 వేల బ్లేడ్‌లలో కలిపి ప్రభుత్వానికి రూ.21 కోట్లు చొప్పున నెలకు వస్తుంది. ఇక గ్రానైట్ క్వారీలు నేరుగా ఎక్స్‌పోర్ట్ ద్వారా నెలకు రూ.15 కోట్లు, ఫ్యాక్టరీలకు ముడిరాళ్లను ఇవ్వడం ద్వారా మరో రూ.15 కోట్లు రాయల్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఇలా నెల మొత్తం మీద శ్లాబ్ విధానం, రాయల్టీ రూపంలో కలిపి రూ.రూ.50 కోట్లకు పైగా ఆదాయం వస్తుంది. ఇక రాయల్టీ రూపంలో రూ.30 కోట్లకు కొనుగోలు చేసిన గ్రానైట్ రాళ్లు నెలకు 85 వేల క్యూబిక్ మీటర్లు ఉంటుందని అంచనా. క్యూబిక్ మీటరు ధర సరాసరిన రూ.75 వేలు చొప్పున తీసుకున్నా నెల మొత్తం మీద రూ.650 నుంచి రూ.700 కోట్లు మధ్య ఉంటుందని అంచనా. ఇప్పుడు గ్రానైట్ ఫ్యాక్టరీల మూసివేత కారణంగా గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ ద్వారా వచ్చిన ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకోకుండా వదిలేసినా శ్లాబ్, రాయల్టీ, రాళ్ల విలువ కలిపి నెల మొత్తం మీద కలిపినా నెలకు దాదాపు రూ.450 కోట్ల నుంచి రూ.500 కోట్ల మధ్య ఉంటుంది.

ఫ్యాక్టరీలు నడవకపోతే గడ్డు కాలమే

గ్రానైట్ ఫ్యాక్టరీలు సక్రమంగా నడవకపోతే నెల నెలా బ్యాంకులకు చెల్లించాల్సిన వాయిదాలు, కరెంటు బిల్లులు, కార్మికులకు ఎంతో కొంత జీతాల రూపంలో చెల్లించాల్సి వస్తుంది. ఫ్యాక్టరీలు మూత పడితే అవన్నీ యజమానులకు అలవిగాని భారంగా మారుతుంది. అలాగని ప్రైవేటుకు చెందిన ఏఎంఆర్ కంపెనీ వారు అడిగినంత రాయల్టీలు, అదనపు రుబాబు వసూళ్లు చెల్లించేందుకు యజమానులు సుముఖంగా లేరు.



మర్రిచెట్లపాలెంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలు

ఊరెళ్లిపోతున్న గ్రానైట్ కార్మికులు

గ్రానైట్ పాలిషింగ్ ఫ్యాక్టరీలలో పనిచేసే కార్మికుల్లో 90 శాతం మంది మన రాష్ట్రంతో పాటు రాజస్థాన్, బీహార్, ఒడిశా, తమిళనాడు, తెలంగాణ, యూపీ, ఇతర రాష్ట్రాలకు చెందిన వారే ఉన్నారు. దసరా, దీపావళి పండుగలు వరుసగా రావడం, మరో పక్క గ్రానైట్ ఫ్యాక్టరీలు మూతపడి చేతికి పనిలేకపోవడంతో బుధవారం నుంచే కార్మికులు సొంత రాష్ట్రాలకు వెళ్లిపోవడం మొదలు పెట్టారు. ఊరెళ్లిన కార్మికులను మళ్లీ ఫ్యాక్టరీల బంద్ విరమించిన తర్వాత పిలిపించుకోవాలంటే వారికి డబుల్ చార్జీలు ఇవ్వాల్సి వస్తుంది. సొంతూళ్లకు వెళ్లిన కార్మికులు తిరిగి రావడానికి కనీసం ఒకటి రెండు నెలల గడువు పడుతుంది. ఫ్యాక్టరీలు మూతపడి కొంతకాలం, ఊరెళ్లిన కార్మికులు తిరిగి రావడానికి మరికొంత కాలం పడుతుంది. మూతపడిన ఫ్యాక్టరీలు గాడిలో పడటానికి రెండు మూడు నెలల సమయం పడుతుందని యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

> **గ్రానైట్ ఫ్యాక్టరీలన్నీ మూతేశాం**
>
> శ్లాబ్ విధానంలో ఒక్కో బ్లేడ్‌కు రూ.27 వేల నుంచి రూ.35 వేలకు పెంచినందుకు నిరసనగా బుధవారం నుంచి చీమకుర్తి, ఆర్‌ఎల్.పురం బూదవాడ, మర్రిచెట్లపాలెం పరిధిలోని గ్రానైట్ ఫ్యాక్టరీలన్నీ మూతేశాం. దాని ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కూడా భారీగానే తగ్గే అవకాశం ఉంటుంది.
>
> – యర్రగుంట్ల శ్రీనివాసరావు, ఫ్యాక్టరీల సంఘం నాయకుడు, చీమకుర్తి

రాష్ట్రంలో దిగజారుతున్న పరిస్థితులు

- అధికార పార్టీ ఎమ్మెల్యేలే ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు
- వైఎస్సార్ సీపీ బలోపేతానికి చర్యలు
- మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



మాట్లాడుతున్న కారుమూరి నాగేశ్వరరావు, పక్కన బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వెంకాయమ్మ, తాటిపర్తి చంద్రశేఖర్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, తూమాటి మాధవరావు, జూపూడి ప్రభాకర్, మేరుగు నాగార్జున, కదిరి బాబూరావు, కేపీ నాగార్జునరెడ్డి, అన్నా రాంబాబు, దద్దాల నారాయణ, చుండూరి రవిబాబు తదితరులు

ఒంగోలు సిటీ: కూటమి పాలన నానాటికీ దిగజారుతోందని, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులపై కూటమి పార్టీల ఎమ్మెల్యేలే ప్రశ్నిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. యూరియా గురించి తాము మాట్లాడితే అబద్ధమంటారని, అధికార పార్టీ ఎమ్మెల్యేలు సైతం యూరియా సమస్యపై ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారన్నారు. రోడ్లు బాగలేవని తమ నియోజకవర్గాల్లో ప్రజలు తిరగనిచ్చే పరిస్థితులు లేవని అధికార పార్టీ ఎమ్మెల్యేలే వాపోతున్నారన్నారు. లంచాలు తీసుకుంటున్నామని అధికార పార్టీ ఎమ్మెల్యే ఒకరు బహిరంగంగా వ్యాఖ్యానించారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతోందని కారుమూరి దుయ్యబట్టారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక పంటలను రోడ్డుపై పారబోసుకుంటున్నారని వాపోయారు.

కార్యకర్తలే వెన్నెముక..

వైఎస్సార్ సీపీకి కార్యకర్తలే వెన్నెముక అని కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసే దిశగా పార్టీ అధినేత చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. పార్టీ పిలుపునిచ్చిన కార్యక్రమాలను జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, ఎమ్మెల్యే చంద్రశేఖర్, అన్ని వర్గాల ఇన్‌చార్జిలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని ఆయన చెప్పారు. డిసెంబరు నెలాఖరులోపు కార్యకర్తలకు ఐడీ కార్డులు, బీమా సౌకర్యాన్ని కల్పిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అరాచకాలతో ఇబ్బందులు పడుతున్న నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నామని కారుమూరి చెప్పారు. గ్రామస్థాయిలో ఎలాంటి చిన్న సమస్య ఎదురైనా క్షణాల్లో అధిష్టానం దృష్టికి వచ్చేలా ఇది ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకరరావు, ఎస్ఎన్‌పాడు ఇన్‌చార్జ్, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఒంగోలు ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, మార్కాపురం ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే కె.నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైజాగ్ పార్లమెంట్ అబ్జర్వర్ కదిరి బాబురావు, కనిగిరి ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, మాజీ ఎమ్మెల్యే, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి ఆదెన్న, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శులు బొట్ల రామారావు, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, కనిగిరి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, మీరావలి, తదితరులు పాల్గొన్నారు.

కళారాల సంబరం





శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఒంగోలులో బుధవారం కళారాల ఊరేగింపు కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. - సాక్షి, ఒంగోలు

ఒంగోలు మస్తాన్‌దర్గా సెంటర్ వద్ద కళారాల ఊరేగింపు

ఎస్పీని కలిసిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, నాయకులు



ఎస్పీ హర్షవర్ధన్ రాజుతో వైఎస్సార్ సీపీ నాయకులు

ఒంగోలు టౌన్: సాధారణ బదిలీల్లో భాగంగా నూతన ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వి.హర్షవర్ధన్ రాజును జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్ పర్సన్, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ ఛాంబర్‌కు వచ్చిన నాయకులు ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి మేరుగు నాగార్జున, ఎంఎల్‌సీ తూమాటి మాధవరావు, మాజీ ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కేపీ నాగార్జున రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ జూపూడి ప్రభాకర రావు, పార్టీ పార్లమెంటు పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి బాబు, కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ, కదిరి బాబురావు, ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కనకరావు మాదిగ, రాష్ట్ర బూత్ వింగ్ ప్రెసిడెంట్ కాకుమాను రాజశేఖర్ ఎస్పీని కలిసిన వారిలో ఉన్నారు.

గనుల శాఖ ఆదాయంపై నిరంతర పర్యవేక్షణ

● కలెక్టర్ రాజాబాబు


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు సబర్బన్: గనుల శాఖ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయంపై నిరంతర పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. ప్రకాశం భవనంలోని తన ఛాంబర్‌లో గనులు, ఏపీ ఎండీసీ, పర్యావరణ కాలుష్యం నియంత్రణ మండలి, రవాణా, ఆర్టీసీ ఉన్నతాధికారులతో బుధవారం ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. జిల్లాలోని గనుల విస్తీర్ణం, వాటి రకాలు, లభిస్తున్న ఉపాధి, రవాణా, ప్రభుత్వానికి వస్తున్న ఆదాయం, ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు, తదితర వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఆయా వివరాలను సంబంధిత శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుతం ఇదే సమయానికి 18శాతం వృద్ధి ఉన్నట్లు గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా ప్రభుత్వం మన జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల ఇసుకను అందుబాటులో ఉంచాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ప్రస్తుతం జిల్లాలోని 12 స్టాక్ యార్డుల్లో 80 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఈఈ రాఘవరెడ్డి, డీటీసీ ఆర్.సుశీల, ఆర్టీసీ ఆర్ఎం జి.సత్యనారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఒంగోలు ఆర్టీసీ డిపోలో చోరీ

● 10 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.9 వేల నగదు అపహరణ

ఒంగోలు టౌన్: దసరా పండుగ నేపథ్యంలో ఆర్టీసీ డిపో ప్రయాణికులతో కిటకిటలాడుతోంది. దీన్ని ఆసరాగా చేసుకొని దొంగలు చేతివాటం ప్రదర్శించి బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. సర్వేరెడ్డిపాలెంకు చెందిన పోపూరి సుమతి పర్చూరు వెళ్లేందుకు బుధవారం ఒంగోలు ఆర్టీసీ డిపోకు వచ్చారు. ఈ క్రమంలో బస్సు రాగానే ప్రయాణికులు ఒకరినొకరు తోసుకుంటూ బస్సు ఎక్కారు. ఎందుకో అనుమానం వచ్చిన సుమతి తన పర్సు తీసి చూడగా అందులోని బంగారు ఆభరణాలు కనిపించలేదు. ఆందోళన చెందిన ఆమె వెంటనే ఆర్టీసీ డిపోలో ఔట్‌పోస్టులో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే బస్సులో కొత్తపట్నం మండలం ఆలూరు నుంచి ఇంకొల్లు వెళ్లేందుకు బస్సు ఎక్కిన కనపర్తి సువార్తమ్మ పర్సులోని రూ.9 వేల నగదు మాయమైనట్లు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి సీసీ కెమెరాలు పరిశీలించారు. వన్‌టౌన్ సీఐ నాగరాజు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

రాచర్ల: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని ఒద్దులవాగుపల్లెలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఒద్దులవాగుపల్లె గ్రామానికి చెందిన మదిరె ఈశ్వర్‌రెడ్డి (60) అప్పుల బాధ భరించలేక బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఉరేసుకొని ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.


మదిరె ఈశ్వర్‌రెడ్డి మృతదేహం

కార్యకర్తలే పార్టీకి బలం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు, పక్కన బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, జూపూడి ప్రభాకర్, బత్తుల బ్రహ్మానందరెడ్డి, తూమాటి మాధవరావు, మేరుగు నాగార్జున, అన్నా రాంబాబు, కె.నాగార్జునరెడ్డి, దద్దాల నారాయణ, చుండూరి రవిబాబు, కదిరి బాబురావు తదితరులు

● పార్టీని బలోపేతం చేయడంలో వారే కీలకం
● వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు
● బూచేపల్లి అధ్యక్షతన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశం

ఒంగోలు సిటీ: 'కార్యకర్తలే పార్టీకి బలం. వారికి పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. 17 మెడికల్ కళాశాలలు, సచివాలయ వ్యవస్థ, పోర్టులు వంటి వాటితో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చారన్నారు. పార్టీని ఎలా పటిష్టం చేసుకోవాలో వివరించారు.

కార్యకర్తలకు అండగా ఉండేందుకే డిజిటల్ బుక్

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేసుకోవడంలో కార్యకర్తలకే కీలకమన్నారు. ఏ పార్టీకైనా జెండా మోసే నాయకులు, కార్యకర్తలు లేకపోతే పార్టీ నిలబడదని చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పోలీసుల తీరుతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని, వారిపై అక్రమ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. అందుకే వారికి అండగా ఉండేందుకు డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు వారి సమస్యలను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలని సూచించారు. నాయకులు, కార్యకర్తలను ఇబ్బందులు పెట్టిన ప్రజాప్రతినిధులు, అధికారులపై భవిష్యత్‌లో చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఒక చిన్న స్థాయి ఎంపీటీసీ నుంచి ఎమ్మెల్యేగా, పార్టీ జిల్లా అధ్యక్షునిగా ఎదిగానంటే మీ అందరి ఆదరణ అభిమానమేనన్నారు. కార్యకర్త పడే కష్టాలు, ప్రజాప్రతినిధులు పడే కష్టాలు తెలుసని, పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు భవిష్యత్‌లో పార్టీ అధికారంలోకి వచ్చి వెంటనే గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. కష్టకాలంలో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలను మర్చిపోమన్నారు. ప్రజా సమస్యలపై చేస్తున్న కార్యక్రమాల్లో నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలోపేతం చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలన్నారు. కష్టపడి పనిచేసిన వారికి రానున్న రోజుల్లో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ తుమాటి మాధవరావు మాట్లాడుతూ 75 ఏళ్లలో జరిగిన అభివృద్ధిని గత ఐదేళ్లలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగించాలని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నాయకులు, కార్యకర్తలు సంసిద్ధంగా ఉండాలని, జిల్లాలోని అన్ని స్థానాలు కైవసం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకుడు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మాజీ మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగ నాగార్జున, మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు, గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కె.నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, వైజాగ్ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబురావు, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ చుండూరి రవిబాబు, కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.శివశంకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్రా భాస్కరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శి కసుకుర్తి ఆదెన్న, పార్లమెంట్ రాష్ట్ర కార్యదర్శులు కేవీ రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, బొట్ల రామారావు, రాష్ట్ర వాణిజ్య విభాగం అధ్యక్షుడు కుప్పం ప్రసాద్, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు కాకుమాను రాజశేఖర్, రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకరరావు, జిల్లా అఫిలియేటెడ్ వింగ్ ఇన్‌చార్జి వెంకటప్పరెడ్డి, రాష్ట్ర ఐటీ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీహెచ్ విజయభాస్కరరెడ్డి, అశోదియలమందారెడ్డి, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


హాజరైన నాయకులు, కార్యకర్తలు

పొగాకు వేలం అడ్డగింత

● ఒక్కసారిగా ధరలు తగ్గించడంపై రైతుల మండిపాటు
● వ్యాపారులతో చర్చల అనంతరం కొనసాగిన వేలం

కొండపి: ఒక్కసారిగా పొగాకు ధరలు దిగ్గోయడంపై రైతులు మండిపడ్డారు. ఇప్పటికే నష్టాల్లో ఉంటే మళ్లీ ధరలు తగ్గించడం ఏంటని రైతులు పొగాకు వేలాన్ని అడ్డుకున్నారు. ఈ సంఘటన బుధవారం కొండపి పొగాకు వేలం కేంద్రంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..క్లస్టర్ పరిధిలోని గుర్రప్పడియ, మూగచింతల, నెన్నూరుపాడు, చతుకుపాడు, కె.అగ్రహారం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి వచ్చారు. అయితే వేలం ప్రారంభమైన కొద్ది సేపటికే కొన్ని రోజులుగా పెంచిన ధరలను ఒక్కసారిగా రూ.100 తగ్గించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేసి వేలాన్ని అడ్డుకున్నారు. తమ క్లస్టర్ పరిధిలోకి వచ్చేసరికి ధరలు ఎందుకు తగ్గిస్తున్నారని వేలం నిర్వహణ అధికారి సునీల్‌కుమార్‌ను ప్రశ్నించారు. ప్రస్తుతం మార్కెట్ లేకపోవడంతో ధరలు తగ్గించారని సర్దిచెప్పే ప్రయత్నం చేయగా..రైతులు ఒప్పుకోలేదు. రైతులందరి వద్ద ఒకే విధంగా కొనుగోలు చేయానే గానీ ఇష్టం వచ్చినట్లు కొనుగోలు చేస్తే కుదరదని చెప్పి వేలాన్ని బహిష్కరించారు. గరిష్ట ధర రూ.340లకు కొనుగోలు చేయాల్సిందేనని భీష్మించారు. దీంతో వేలం నిర్వహణాధికారి రైతులు, వ్యాపారులతో చర్చించి అదే ధరకు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో తిరిగి వేలం ప్రారంభమైంది.

పొగాకు కనిష్ట ధర రూ.90

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో నిర్వహించిన వేలంలో పొగాకు కనిష్ట ధర రూ.90 పలికిందని వేలం నిర్వహణాధికారి జి.సునీల్‌కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని మూగచింతల గుర్రప్పడియ, నెన్నూరుపాడు, కె అగ్రహారం, చతుకుపాడు గ్రామాల చెందిన రైతులు 1214 బేళ్లను వేలానికి తీసుకురాగా 1146 బేళ్లను కొనుగోలు చేసి 68 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ.330, సరాసరి ధర రూ.260.09గా నమోదైంది. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయి.


రైతులతో చర్చిస్తున్న అధికారులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం

● అర్బన్ వైద్యశాలలను సందర్శించిన సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు రమాదేవి


అర్బన్ వైద్యశాల వద్ద మాట్లాడుతున్న రమాదేవి

ఒంగోలు టౌన్: పీపీపీ పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టడం దుర్మార్గమని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యురాలు డి.రమాదేవి తీవ్రంగా విమర్శించారు. వైద్యం కోసం పేదలు అప్పులు చేస్తున్నారని, నిరుపేదలకు వైద్య సేవలను అందిస్తున్న అర్బన్ వైద్యశాలలో మెరుగైన వైద్య సేవలందించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం నగర కమిటీ నాయకులతో కలిసి స్థానిక పాపాకాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లో బుధవారం సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న వైద్య సిబ్బందిని, చికిత్స కోసం వచ్చిన రోగులను వైద్యశాలలో లభిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అత్యవసర సేవా రంగంగా గుర్తించిన వైద్యరంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ వైద్యం అందుబాటులో లేకపోవడంతో నిరుపేదలు అనివార్య పరిస్థితుల్లో ప్రైవేట్ ఆస్పత్రులకు పరుగులు తీస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం అందుతున్న అరకొర ప్రభుత్వ వైద్యాన్ని సైతం ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఒంగోలు నగరంలోని పాపాకాలనీలో పనిచేస్తున్న వైద్యుడిని మంగళవారం, గురువారం, శనివారం డిప్యూటేషన్‌పై నియమించడంతో ఇక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు

ఇన్ సర్వీసు కోటా పునరుద్ధరించాలి

ప్రభుత్వ వైద్యులు తమ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకునేందుకు పీజీ చేయడం పరిపాటేనని రమాదేవి చెప్పారు. గతంలో పీహెచ్‌సీ వైద్యులకు పీజీ ప్రవేశాల్లో 30 శాతం ఇన్ సర్వీసు కోటా ఉండేదని , దాన్ని కూటమి ప్రభుత్వం రద్దు చేసి 15 శాతానికి కుదించడం దారుణమన్నారు. పీహెచ్‌సీ వైద్యులకు కోటాను యథాతథంగా కొనసాగించాలని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యుల సమ్మెను ఉపసంహరించడానికి ప్రభుత్వం చొరవ చూపాలని, వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చీకటి శ్రీనివాసరావు, కంకణాల రమాదేవి, సయ్యద్ హుసేన్, ఆర్.శ్రీనివాసరావు, తంబి శ్రీనివాసరావు, జి.రమేష్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగివచ్చే వరకు సమ్మె


ధర్నాలో నినాదాలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

ఒంగోలు టౌన్: ప్రాథమిక వైద్యశాలల్లో పనిచేస్తున్న వైద్యులకు పీజీ ప్రవేశాల్లో ఇన్ సర్వీసు కోటా 30 శాతం కొనసాగించాలని, తక్షణమే జీఓ నంబర్ 99ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ డాక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ రాహుల్ డిమాండ్ చేశారు. ఏపీపీహెచ్‌సీడీఏ ఆధ్వర్యంలో బుధవారం ప్రకాశం భవనం వద్ద ధర్నా నిర్వహించారు. జిల్లాలోని అన్నీ పీహెచ్‌సీల వైద్యులు సమ్మెలో పాల్గొని వియ్ వాంట్ జస్టిస్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాహుల్ మాట్లాడుతూ పీహెచ్‌సీలో కొనసాగుతున్న ఇన్ సర్వీసు కోటాను రాష్ట్ర ప్రభుత్వం ఉన్నపళంగా రద్దు చేసి 15 శాతానికి కుదించి 6 బ్రాంచీలకు మాత్రమే పరిమితం చేసిందని తెలిపారు. 10 రోజుల పాటు పీహెచ్‌సీ వైద్యులు ఆందోళనలు చేస్తే దిగివచ్చిన ప్రభుత్వం 20 శాతానికి పెంచిందని, దాన్ని అన్నీ బ్రాంచీలకు వర్తింపచేస్తామని హామీ ఇచ్చిందని వివరించారు. ఒకవేళ అన్నీ బ్రాంచీలకు వర్తింపచేయడం కుదరకపోతే అసోసియేషన్ నాయకులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పిన ప్రభుత్వం ఏడాది తరువాత దాన్ని ఏకపక్షంగా 7 బ్రాంచీలతో 15 శాతం కోటా ఇవ్వాలని నిర్ణయించారని చెప్పారు. ప్రభుత్వం మాట తప్పడం విచారకరమన్నారు. ఒకవేళ 30 శాతం కోటా ఇవ్వడం కుదరకపోతే అన్నీ బ్రాంచీలతో కలుపుకొని 20 శాతం కోటానైనా కొనసాగించాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు తన సర్వీసులో 6 ప్రమోషన్లు వస్తాయని, సివిల్ సర్జన్లుగా విధుల్లో చేరిన పీహెచ్‌సీ వైద్యులు 24 ఏళ్ల పాటు విధులు నిర్వహించినా ఎలాంటి ప్రమోషన్లు ఇవ్వకపోవడం దారుణమన్నారు. పీహెచ్‌సీ వైద్యులు ఏ కేడర్లో అయితే ఉద్యోగంలో చేరుతున్నారో అదే కేడర్లో రిటైర్డ్ అవుతున్నారని, ఈ అన్యాయాన్ని సరిదిద్దాలని, టైం బాండ్ ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. ట్రైబల్ ప్రాంతాల్లో పనిచేస్తున్న పీహెచ్‌సీ వైద్యులకు ఎలాంటి అలవెన్సులు ఇవ్వడం లేదని, బేసిక్‌పే మీద 30 శాతం ట్రైబల్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, చంద్రన్న సంచార చికిత్స ప్రోగ్రాం కింద రూ.5 వేల అలవెన్స్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఖాదర్ మస్తాన్ బి, కోశాధికారి రమేష్ కుమార్, ఉపాధ్యక్షులు ఒనారియలు, సీహెచ్ సరస్వతి, సహాయ కార్యదర్శులు జ్యోతి, నాయబ్ రసూల్, సునిల్ నాయక్, ఆర్గనైజింగ్ సెక్రటరి కుమార స్వామి, ప్రచార కార్యదర్శి సుందర్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు చైతన్య దీపక్, అఖ్తర్ రసూల్, నబి వలి, శ్రీధర్‌రెడ్డి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా కేంద్రాలపై ఆకస్మిక దాడులు


ఒంగోలు ఆర్టీసీ బస్టాండులో వేలిముద్రలు సేకరిస్తున్న పోలీసులు


బాణసంచా దుకాణాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

● నిబంధనలకు వ్యతిరేకంగా నిల్వ చేస్తే కఠిన చర్యలు
● ఎస్పీ హర్షవర్ధన్ రాజు హెచ్చరిక

ఒంగోలు టౌన్: దీపావళి పండుగ నేపథ్యంలో జిల్లాలోని బాణసంచా పరిశ్రమలు, గోడౌన్లు, విక్రయ కేంద్రాలపై బుధవారం పోలీసులు ఆకస్మిక దాడులు చేశారు. బాణసంచా విక్రయదారులు ఫైర్ అధికారుల నిబంధనలను అమలు చేస్తున్నారో లేదో పరిశీలించారు. షాపుల్లో అమర్చిన అగ్నిమాపక పరికరాలు పనిచేస్తున్నాయా లేదో పరిశీలించారు. ఊహించని విధంగా అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు సమీపంలో నీరు, ఇసుక అందుబాటులో ఉంచారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఫైర్ ఇంజన్ వెంటనే చేరుకునేందుకు తగిన స్థలం ఉందో లేదో చూశారు. బాణసంచా తయారీ కేంద్రాలలో కానీ, విక్రయ కేంద్రాలలో కానీ 18 ఏళ్ల లోపు పిల్లల చేత పని చేయించరాదని సూచించారు. పోలీసు నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు.

1034 మందిపై బహిరంగ మద్యం కేసులు నమోదు..

గత నెలలో బహిరంగంగా మద్యం తాగుతున్న 1034 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు తెలిపారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న 293 ప్రదేశాలను గుర్తించి అందులో 265 ప్రదేశాలను శుభ్రం చేయించినట్లు వివరించారు. గుడి, బడి పక్కన గుబురుగా ప్రదేశాలను శుభ్రం చేయించినట్లు చెప్పారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినట్లవుతుందని చెప్పారు. ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తుంటే వెంటనే వీడియో తీసి పోలీసు వాట్సప్ నెంబర్ 9121102266 నంబర్‌కు పంపించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఎంఎస్‌సీడీ ద్వారా నిందితుల గుర్తింపు..

శాంతి భద్రతలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసులు రాత్రి గస్తీ నిర్వహించడమే కాకుండా మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైజ్ (ఎంఎస్‌సీడీ) అనే అత్యంత ఆధునిక పరికరం ద్వారా అనుమానిత వ్యక్తుల వేలి ముద్రలను సేకరిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ పరికరం ద్వారా పోలీసులు ఒక వ్యక్తి నుంచి సేకరించిన వేలి ముద్రలను అక్కడికక్కడే స్కాన్ చేసి అతడి నేరచరిత్రను గుర్తించవచ్చన్నారు. గత నెలలో 4494 మంది వేలిముద్రలు సేకరించగా వారిలో 15 మంది నిందితులను గుర్తించామని, తనిఖీల్లో ఒంగోలుకు చెందిన షేక్ రఫీ అనే నిందితుడు 12 కేసుల్లో ఉన్నట్లు గుర్తించి వెంటనే అతడిని సంబంధిత పోలీసు స్టేషన్లలో బైండోవర్ చేసినట్లు తెలిపారు. నేరాలు ఎక్కువగా జరిగేందుకు అవకాశం ఉన్న బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వంటి ప్రాంతాల్లో వాహన తనిఖీలు, కొత్తగా వచ్చిన వారి పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు.

కారు ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు

కనిగిరిరూరల్: బైక్‌ను కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం కనిగిరి పొగాకు బోర్డు వద్ద జరిగింది. వివరాల్లోకి వెళితే..పెదారికట్లకు చెందిన ఎస్‌కే ఖదీర్ స్కూటీపై కనిగిరి వైపు వస్తున్నాడు. ఆ సమయంలో కనిగిరి నుంచి పొదిలి వైపుకు వేగంగా వస్తున్న కారు పొగాకు బోర్డు యార్డ్ వద్ద బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో స్కూటీ బైక్ ఉన్న ఎస్‌కే ఖదీర్‌కు తలకు బలమైన గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని స్థానిక ఆస్పత్రికి తరలించి మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు. స్కూటీని ఢీకొన్న కారును గడ్డమీదపల్లి వద్ద స్థానికులు అడ్డుకుని ఆపినట్లు తెలిసింది. క్షతగాత్రుడు ఖదీర్ మంగళవారమే బెంగుళూరు నుంచి వచ్చారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.


ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఖదీర్

వేలం తీరును పరిశీలించిన పొగాకు బోర్డు ఈడీ

ఒంగోలు సబర్బన్: త్రోవగుంటలోని పొగాకు వేలం కేంద్రం-2ను పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.విశ్వశ్రీ బుధవారం పరిశీలించారు. వేలం కేంద్రాన్ని సందర్శించి వేలం విధానాన్ని పరిశీలించారు. వ్యాపారులతో కలిసి కొనుగోలు చేస్తున్న తీరును, రైతులకు ధర వస్తున్న వైనాన్ని కూడా పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల వద్ద పొగాకు స్టాక్ ఎంత ఉందో గ్రామాల వారీగా అడిగి తెలుసుకున్నారు. 2025-26 పంట కాలానికి బోర్డు ఇచ్చిన పరిమితి మేరకే పొగాకు సాగు చేసుకోవాలని కోరారు. ఒంగోలు-2 వేలం కేంద్రం సూపరింటెండెంట్ జే.తులసిని పొగాకు మార్కెట్ పరిస్థితిని, బ్యాలెన్స్ క్వాంటిటీ గురించి అడిగి తెలుసుకున్నారు. ప్లాట్‌ఫాంలోని గోడౌన్‌ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు ఆక్షన్ మేనేజర్ రామాంజనేయులు, రీజినల్ మేనేజర్ రామారావు, రైతు నాయకులు పాల్గొన్నారు.


వేలంలో పాల్గొని కొనుగోలు తీరును పరిశీలిస్తున్న పొగాకు బోర్డు ఈడీ విశ్వశ్రీ, ఆర్ఎంలు